క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్

ఫెర్టిలైజర్‌సిటీ: కార్పొరేషన్ 22వ డివిజన్ గౌతమినగర్‌లో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి ఆధ్వర్యంలో షాపులు, వ్యాపార సంస్థలకు డీఎస్‌పీ లైసెన్స్‌లపై అవగాహన కల్పించారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా లైసెన్స్ లేని షాపులు, వ్యాపార సంస్థలను గుర్తించి జరిమానా విధించారు. వ్యాపార సంస్థల నుంచి వచ్చే చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని, ఒకవేళ వేస్తే జరిమానా విధిస్తామని ఆయన పేర్కొన్నారు. వార్డ్ ఆఫీసర్ సాయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగు నాగభూషణం, లింగాల కుమారస్వామి, ఆడెపు శ్రీనివాస్, వంగర సంపత్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శ్రీకాంత్, ఆర్పీలు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన ఈర్ల నవీన్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా నవీన్‌తో పాటు పదో చదివిన మిత్రులు రూ.13వేలు బుధవారం కుటుంబ సభ్యులకు అందించారు. స్వప్న, శిరీష, రమ్య, దీపిక, ప్రియాంక, రవి, హరీశ్, శివాజీ, భాస్కర్, ప్రశాంత్, నవీన్‌రెడ్డి, స్వామి, పాషా, కుమారస్వామి, నాగరాజు, మహేశ్, శీను, రాజు, మహేందర్ ఉన్నారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు



గోరింటాకు చూపిస్తున్న మహిళలు

సుల్తానాబాద్: ఆషాఢం సందర్భంగా పట్టణంలోని బ్యాంక్ కాలనీ మహిళలు గోరింటాకు వేడుకలు బుధవారం వైభవంగా జరుపుకున్నారు. బ్యాంక్ కాలనీలోని ధనలక్ష్మి–సతీశ్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలందరూ తీర్థప్రసాదాలు స్వీకరించి గోరింటాకు పెట్టుకున్నారు. రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన ఉపాధ్యాయురాలు వనజ, ఐల రాధ, అనసూయ, స్వరూప, శారద, మంజుల, శ్రీదేవి, అరుణ, కరుణ, సుగుణ, పద్మ, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

యైటింక్లయిన్‌కాలనీ: సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులకు సైబర్‌క్రైం, ఆన్‌లైన్ మోసాలు, యాంటీడ్రగ్స్‌పై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణ కోసం షీటీంలు పనిచేస్తున్నాయని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. షీటీం సభ్యులు సురేశ్, స్నేహలత, మౌనిక, పాఠశాల కరస్పాండెంట్ పాపిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఎలిగేడు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో భాస్కరరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పత్యేకాధికారులు, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్, ఫిట్టింగ్, ఫాగింగ్ పనులపై సూచనలు చేశారు. ఎంపీవో కిరణ్, ఏఈ ఇరిగేషన్, టీఏ కార్యదర్శులు ఉన్నారు.

మడేలేశ్వరస్వామికి బోనాలు



జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వర స్వామి బోనాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి స్థానిక ఆలయంలో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ మొక్కులు చెల్లించారు. రజక సంక్షేమ సంఘం నాయకుడు, సంఘం అధ్యక్షుడు కూనరాజుల రాజయ్య, నాయకులు రాములు, భూమయ్య, అంజయ్య, శంకర్, సంపత్, లచ్చయ్య, ఓదెలు, శ్రీను, కొండయ్య, మోహన్, మల్లేశ్ పాల్గొన్నారు.

అలంకారప్రాయం.. రాఘవాపురం రైల్వేస్టేషన్

- కేవలం రెండు రైళ్లకే హాల్టింగ్
- శాశ్వత రహదారి, వీధిదీపాలు లేక ఇబ్బందులు
- దృష్టిసారించని పాలకులు, అధికారులు
- అవస్థలు పడుతున్న మండల ప్రజలు



రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి



రాఘవాపురం రైల్వేస్టేషన్

పాలకుర్తి: కాజీపేట–బల్లార్ష సెక్షన్ల మధ్య గల రాఘవాపురం రైల్వేస్టేషన్‌లో సరైన సౌకర్యాలు లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామగుండం, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల పరిధిలోని దాదాపు 20గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండే రాఘవాపురం రైల్వేస్టేషన్‌పై సంబంధితశాఖ అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. దీంతో మండల ప్రజలకు రైల్వే ప్రయాణం దూరభారంగా మారింది. పాలకుర్తి, పెద్దపల్లి మండలాల పరిధిలోని గ్రామాల నుంచి నిత్యం విద్య, ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు రైల్వే ప్రయాణం చేస్తారు. అయితే స్టేషన్‌లో సౌకర్యాలు లేకపోవడమే కాదు అన్ని ప్యాసింజర్ ట్రైన్లకు అవకాశం కల్పించకపోవడంతో స్థానికులు రైల్వే ప్రయాణానికి దూరం అవుతున్నారు.

కేవలం రెండు రైళ్లకే హాల్టింగ్..

కరోనాకు ముందు అన్ని ప్యాసింజర్ ట్రైన్లు ఇక్కడ ఆగేవి. ప్రస్తుతం భాగ్యనగర్, కరీంనగర్ పుష్‌పుల్ ట్రైన్లు మాత్రమే ఆగుతున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు దాదాపు 10కిలోమీటర్ల దూరంలోని పెద్దపల్లి, రామగుండం రైల్వేస్టేషన్లకు వెళ్లి ట్రైన్లు ఎక్కుతున్నారు. దీంతో తమకు అదనపు ఖర్చుతో పాటు సమయాభావం, దూరభారం అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత రహదారి లేక ఇబ్బందులు..

రాఘవాపూర్ రైల్వేస్టేషన్ ఏర్పాటై దాదాపు 30ఏళ్లకు పైబడి అవుతున్నా ఇప్పటికీ రైల్వేస్టేషన్‌కు శాశ్వత రహదారి నిర్మాణం లేదు. ఫోర్‌లైన్ రహదారికి కేవలం 300 మీటర్ల దూరంలో గల ఈ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో కనీసం వీధిదీపాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళల్లో రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలతో నిండి గుంతలమయంగా ఉండడంతో చీకట్లో దారిగుండా రావాలంటే ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

అన్ని ప్యాసింజర్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి



రాఘవాపూర్ రైల్వేస్టేషన్‌లో అన్ని ప్యాసింజర్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తే చుట్టుపక్కలా దాదాపు 20గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం స్థానికంగా హాల్టింగ్ లేని కారణంగా చాలా మంది ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు పెద్దపల్లి, రామగుండం రైల్వేస్టేషన్‌లకు వెళ్లి ట్రైన్లు ఎక్కుతున్నారు. – రామగిరి చంద్రమౌళి, బసంత్‌నగర్

ఎవరూ పట్టించుకోవడం లేదు



రాఘవాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధి గురించి అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. శాశ్వత రోడ్డు నిర్మాణం, వీధిదీపాలు లేకపోవడంతో స్టేషన్‌కు వచ్చిపోయే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకుర్తి మండల పరిధిలో ఉన్న ఈ ఒక్క రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి. – కామెర రమేశ్, బసంత్‌నగర్

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట



సభకు తరలుతున్న మహిళలు

సుల్తానాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేసిందని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల నుంచి బుధవారం పెద్దపల్లి బహిరంగ సభకు మహిళలను తరలించారు. ఆమె మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా మహిళా శక్తి, మహిళా ఉన్నతి–తెలంగాణ ప్రగతి, ఇందిరా మహిళా శక్తి సంబరాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే విజయ రమణారావు ఆదేశాల మేరకు మున్సిపల్‌లో, మెప్మా ఆధ్వర్యంలో గ్రూపు మహిళా సంఘాల సభ్యులను తరలించారు. బిరుదు కృష్ణ, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

మంత్రుల సభకు భారీగా మహిళలు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల నుంచి వెలుగు సమాఖ్య మహిళా సంఘాల సభ్యులు పెద్దపల్లిలో నిర్వహిస్తున్న ఇందిర మహిళా శక్తి సంబరాల సభకు తరలివెళ్లారు.

ఓసీపీత్రీలో బోనాల పండుగ



డ్యాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3 ప్రాజెక్టు కృషిభవన్‌లో బోనాల పండుగను కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, పోతరాజుల నృత్యాల మధ్య బోనాల జాతర ఘనంగా సాగింది. ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ఆర్జీ–టూ జీఎం బండి వెంకటయ్య, అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సర్వే



స్వాగతం పలుకుతున్న మహిళలు

ముత్తారం: మండలంలోని పారుపల్లి, ముత్తారంలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా అధికారులు వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ జిల్లా బృందం అధికారులు రాఘవులు, రేణుకకు స్థానిక మహిళలు స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 16 వ్యక్తిగత మరుగుదొడ్లు, సెగ్రిగేషన్ షెడ్ ప్లాంట్స్, పాఠశాల పరిసరాలు, గ్రామపంచాయతీ పరిశుభ్రతను పరిశీలించారు. సెంట్రల్ టీం సభ్యులు కొంగ జయంత్, తుమ్మ ప్రసాద్, ఎంపీడీవో సురేశ్, ఎంపీవో భాస్కర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం పద్మ, కార్యదర్శి రవీందర్, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి బోనాలు



బోనమెత్తిన మనాలి ఠాకూర్

గోదావరిఖనిటౌన్: స్థానిక ఐబీకాలనీలోని పెద్దమ్మతల్లి ఆలయంలో రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ బుధవారం పెద్దమ్మతల్లికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సబ్బు మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

గోదావరిఖనిటౌన్: కరెన్సీ నోట్లపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని ఢిల్లీ నుంచి వస్తున్న జీప్ యాత్రకు బుధవారం నగరంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం పక్షాన స్వాగతం పలికారు. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ బొమ్మ సాధన సమితి జాతీయ చైర్మన్ జేరిపోతుల పరశురాం, జాతీయ కన్వీనర్ బొల్లి స్వామి, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులతో కలిసి నగరంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఢిల్లీలో చేపట్టే దళితుల పక్షం సమావేశానికి అన్ని సంఘాలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం నాయకులు కొంకటి లక్ష్మణ్, మిట్టపల్లి రాజేందర్, కోటగిరి పాపయ్య, ఇరుగురాల కిష్టయ్య, శంకర్, చిరంజీవి, రమేశ్ పాల్గొన్నారు.

ట్రినిటి విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్



టూర్‌లో ట్రినిటి విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటి ఇంజనీరింగ్ అటానమస్ కాలేజీ ఎంబీఏ విద్యార్థులు బుధవారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా ప్రయాగ్ కన్స్యూమర్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని సందర్శించారు. పరిశ్రమలో ఫుడ్ ప్రొడక్ట్స్ తయారీపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ఇలాంటి టూర్లు ఉపయోగపడతాయని అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణి గణేశన్ అన్నారు. హెచ్‌వోడీ ఆరిఫ్, రామ్మోహన్, అంబిక, శ్రీలత, రమేశ్, సాయిశ్రావణి ఉన్నారు.

పాఠశాలలో టాయిలెట్లు ప్రారంభం

ఎలిగేడు: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన సేవా సమితి చైర్‌పర్సన్ గాయత్రి గుప్తా ఆధ్వర్యంలో మల్కా యశస్వి సహకారంతో నూతనంగా నిర్మించిన బాలికల టాయిలెట్స్ ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

• కార్మికులను మభ్య పెడుతున్నారు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలుపొందిన ఏఐటీయూసీ కార్మికులను మభ్య పెడుతూ పబ్బం గడుపుతోందని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ విమర్శించారు. ఆర్జీ–3 ఓసీపీ–1 సీహెచ్‌పీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంతింటి పథకం అమలు చేస్తామని మోసం చేశారన్నారు. విజిలెన్స్ పేరుతో మెడికల్ ఆపడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్, కొమ్ము మదనయ్య, గోషిక అశోక్, శాంతి స్వరూప్, వీరయ్య పాల్గొన్నారు.

• విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కాట్నపల్లి మాజీ సర్పంచ్ మోరపెల్లి మోహన్‌రెడ్డి అదే గ్రామంలో బీటెక్ చదువుతున్న మేకల ఓదెలు కూతురికి బుధవారం రూ.50వేల విలువ గల ల్యాప్‌టాప్ అందజేశారు. ఓదెలు కుటుంబ సభ్యులు మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

• ఎల్‌ఈడీ బల్బులు అందజేత

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేట గ్రామ పంచాయతీకి కమాన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్‌ఈడీ బల్బులను పంచాయతీ కార్యదర్శి ప్రవళికకు క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లలిత, ఏపీవో మారుతి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సభ్యులు మచ్చగిరి రాము, జబ్బార్‌ఖాన్, అనవేన లక్ష్మీరాజం, మాటేటి కుమార్ ఉన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శి ఎంపిక

గోదావరిఖనిటౌన్: పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నూతన అధ్యక్షుడిగా గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కానుగంటి శ్రీనివాస్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

• ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ డ్రైవ్

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కే ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.సుబ్బారావు తెలిపారు. 2018 నుంచి 2025 వరకు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

• వర్షం కురవాలని గ్రామదేవతలకు పూజలు

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో గ్రామస్తులు బుధవారం వర్షాలు కురవాలని గ్రామ దేవతలను పూజించారు. గ్రామంలోని బగుల్లగుట్ట దేవాలయంలోని దేవతలకు మొక్కులు చెల్లించారు. అనంతరం ఆ జలాలతో ఊరేగింపుగా గ్రామంలోని భూలక్ష్మి, పోచమ్మ, హనుమాన్ ఆలయాల్లో వర్షాలు కురవాలని పూజలు చేశారు.

• బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో బుధవారం రాష్ట్రమంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, సీతక్కల పర్యటన నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతలను రూరల్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్‌తో పాటు కొయ్యడ సతీష్, వెంకటేశ్, పూదరి చంద్రశేఖర్, వంశీ, అన్వేష్, సలావుద్దీన్, తౌఫిక్ లు అరెస్టయిన వారిలో ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్: బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు బుధవారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరుపతిరెడ్డి, ఇబ్రహీం, దేవయ్య, కరుణాకర్ ఉన్నారు.

ఎలిగేడు: మండలంలోని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేసి స్థానిక ఠాణాలో ఉంచారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు తానిపర్తి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ రాచర్ల కొండయ్య, రంజిత్‌రెడ్డి, మనోహర్, కుమార్‌యాదవ్ ఉన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తరలించినవారిలో నాయకులు అరుణ్, నాగరాజు, రాజు ఉన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోంది



మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి

గోదావరిఖని: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని బీఆర్‌ఎస్ నాయకుడు వ్యాల్ల హరీశ్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు స్వర్ణయుగం చూశారని, సీఎం రేవంత్‌రెడ్డిపాలనలో అరాచకం సాగుతోందన్నారు. రైతులకు రైతుబీమా, రైతుబంధు, రుణమాఫీ జరిగాయని, కాంగ్రెస్ పాలనలో మాత్రం రైతుబీమా ఊసేలేదన్నారు. కాంగ్రెస్ ర్యాలీలకు, మంత్రుల సభలకు అనుమతి ఇస్తూ, బీఆర్‌ఎస్ సభలకు అనుమతి ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు రమణారెడ్డి, తస్లిమా భాను, జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాస్, శ్రీహరి, రామస్వామి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు.



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణం ప్రయివేటు వాహనాలకు పార్కింగ్‌గా మారింది. రోజుల తరబడి వాహనాలను పార్కింగ్ చేస్తున్నప్పటికీ పీహెచ్‌సీ సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పీహెచ్‌సీలో ఉండే 108 వాహనం వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉందని సిబ్బంది పేర్కొంటున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో చోరీకి యత్నం



24 గంటలు సెక్యూరిటీ గార్డ్‌లు ఉండే ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్ ప్రధాన గేట్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎరువుల కర్మాగారం అధికారులు, ఉద్యోగులు నివాసముండే ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో కొన్నిరోజులుగా టౌన్‌షిప్‌లో తాళం వేసి ఉన్న క్వార్టర్లను దొంగలు టార్గెట్ చేసి దొంగతనానికి పాల్పడుతున్నారు. 10రోజుల క్రితం టౌన్‌షిప్‌లోని సుమారు 12 క్వార్టర్లలో తాళాలు పగలగొట్టి దొంగతనానికి యత్నించారు. శుక్రవారం రాత్రి టౌన్‌షిప్‌లో క్వార్టర్ తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లిన దొంగలు ఇంట్లో యజమాని ఉండడంతో పరారయ్యారు. 24గంటలు ప్రైవేట్ సెక్యూరిటీ పర్యవేక్షణలో టౌన్‌షిప్ ఉంటుంది. టౌన్‌షిప్‌లోకి కొత్త వ్యక్తులు వస్తే అనుమతి లేకుండా టౌన్‌షిప్‌లోకి అనుమతించరు. ఇంత సెక్యూరిటీ ఉన్న గత పది రోజులుగా టౌన్‌షిప్‌లోని తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. కర్మాగారంలో లోడింగ్ విభాగంలో బీహార్ రాష్ట్రానికి చెందిన కొందరు కూలీలు టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నారు. బీహార్ కూలీలు గాంజా మత్తులో టౌన్‌షిప్‌లో దొంగతనాలు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. టౌన్‌షిప్ దొంగతనాలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో కర్మాగారంలో వివిధ విభాగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు 400 మంది కుటుంబాలు నివాసముంటున్నాయి. టౌన్‌షిప్‌లో దొంగలు పడుతున్నారన్న సమాచారంతో ఇళ్లలో ఉండే మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి ప్రధాన గేట్‌తో పాటు కాలనీలో పలు కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి!

- డివిజన్ల విస్తరణతో ఆశావహుల అంచనాలు గల్లంతు
- సరిహద్దు మార్పులతో సందిగ్ధంలో ఆశావహులు



రామగుండం రైల్వేస్టేషన్

రామగుండం: గత కార్పొరేషన్ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి చెందిన అభ్యర్థులు ఎలాగైనా కార్పొరేటర్ కావాలనే లక్ష్యం, పట్టుదలతో ఐదేళ్లుగా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో ముందుంటున్నారు. త్వరలోనే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న ఊహాగానాలతో ఆశావాహులు మరింత దూకుడు పెంచారు. కాంగ్రెస్ కేడర్‌కు ఇప్పటి నుంచే ఎమ్మెల్యేలు దిశానిర్దేశం చేస్తున్నారు. కార్పొరేషన్‌లో లింగాపూర్, అక్బర్‌నగర్, పెంచికల్‌పేట తదితర గ్రామాలు/అనుబంధ గ్రామాల విలీనంతో డివిజన్ల స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఫలితంగా 50డివిజన్లుగా ఉన్న కార్పొరేషన్ 60డివిజన్లుగా విస్తరణ చెందింది.

హద్దులు మారడంతో అంచనాలు తారుమారు..

డివిజన్ల విస్తరణతో ఇప్పటికే సదరు డివిజన్లలో పోటీకి సిద్ధంగా ఉన్న ఆశావహులు పోటీ చేయడంపై దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పోటీ చేసే డివిజన్‌లో ఉన్న సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఎమ్మెల్యే, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపించేవారు. ప్రస్తుతం డివిజన్ల విస్తరణతో ఐదేళ్లుగా పోటీ చేయాలనుకున్న సదరు డివిజన్ ప్రస్తుతం మూడు ముక్కలు కావడంతో ఆశావహుల్లో పోటీపై సందిగ్ధం నెలకొంది.

ఒకరికి మోదం.. మరొకరికి ఖేదం

డివిజన్ల విస్తరణతో కొందరిలో నిరుత్సాహం నెలకొనగా, మరికొందరు ఊహించని అవకాశంతో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. గతంలో తమ సంబంధీకులు, కులస్తులు, అత్యంత పరిచయస్తులు, ఆ డివిజన్ ప్రజలతో ఉన్న ప్రత్యేక అనుబంధం దరిమిలా డివిజన్ రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో ముందుగా నిర్ణయించుకున్న డివిజన్‌పైనే ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారు. డివిజన్ల విస్తరణతో ఊహించని విధంగా తమ కులస్తులు, బంధుగణం, పరిచయస్తులు, స్నేహితులు ఇలా అధిక ఓటర్లతో ఎంతో అనుబంధం ఉన్న వారందరూ సదరు డివిజన్ పరిధిలోకి రావడం మరికొందరికి కలిసివచ్చినట్లయింది. ఫలితంగా డివిజన్ల విస్తరణ కొంతమందికి మోదం కాగా మరికొందరికి ఖేదంగా మిగిలింది.

కొంత అనుకూలం.. కొంత ప్రతికూలం

నేను ఇప్పటికే మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా పోటీ చేశారు. గతంలో ఒకే సామాజిక వర్గం ఓటర్లు అధికంగా ఉండడంతో అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి పట్టం కట్టారు. ఫలితంగా ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ప్రస్తుతం డివిజన్ల విస్తరణతో డివిజన్ స్వరూపం మారడంతో నాకు కొంత అనుకూలం, మరికొంత ప్రతికూలంగా మారింది. బరిలో ఉండడం మాత్రం తప్పనిసరి. – బొద్దుపల్లి శ్రీనివాస్, పట్టణ వాస్తవ్యుడు

రామగుండం నుంచే తొలి డివిజన్ ఆరంభం కావాలి

రామగుండం పేరుతోనే ఉన్న కార్పొరేషన్ కార్యాలయం మాత్రం గోదావరిఖనిలో ఉంటుంది. అయినప్పటికీ రామగుండం పట్టణ సరిహద్దు ఒకటో డివిజన్ నుంచి ప్రారంభం కావాలి. గతంలో పట్టణ పరిధిలో 1, 20, 21, 22 డివిజన్లుగా ఉండగా ప్రస్తుతం ఆరు డివిజన్లుగా విస్తరించడంతో వరుస సంఖ్యలో కాకుండా డివిజన్ల సరిహద్దులు ఊహించని విధంగా మారాయి. – అప్పాని శ్రీనివాస్, రామగుండం పట్టణ వాసి

ధూళికట్టలో వన భోజనాలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో పంబాల కులస్తులల ఆధ్వర్యంలో బుధవారం వన భోజనాలు నిర్వహించారు. మహిళలు తలపై గంపలతో శ్రీరేణుక ఎల్లమ్మతల్లి ఆలయానికి వెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండి, అందరూ ఆరోగ్యంగా ఉండాలని పోచమ్మతల్లి, ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లించారు.